క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవం



కొయ్యూరు: సింగవరం షిర్డీ సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం బాబా విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కల్యాణం, తదితరులు పాల్గొన్నారు

వచ్చే నెల 12 నుంచి శ్రీఅష్టలక్ష్మి యాగం



అష్టలక్ష్మి యాగం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎటపాక: ఉష్టగుండాల గ్రామ సమీపంలో వచ్చేనెల 12 నుంచి 23వ తేదీ వరకు 23వ శ్రీఅష్టలక్ష్మి యాగం నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం పురుషోత్తపట్నం రామాలయంలో ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ బుద్దా ఆదినారాయణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక కల్యాణార్థం అష్టలక్ష్మి పీఠం ఆధ్వర్యంలో ఈ యాగాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. వచ్చేనెల 2న యాగశాలకు భూమి పూజ చేయనున్నామన్నారు. ఈ మహత్తర యాగంలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మి పీఠం వ్యవస్థాపకాచార్యుడు పీతాంబరం రఘునాథాచారి, రిటైర్డ్ ఇంజినీర్ నక్క భాస్కరరావు, కుందూరు రామిరెడ్డి, ఏడుకొండలు, శ్రీనివాసరావు, శేఖర్‌బాబు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



మఠం కొత్తూరులో వాహనచోదకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌ఐ సురేష్‌కుమార్

హుకుంపేట: వాహనచోదకులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని స్థానిక ఎస్‌ఐ సురేష్‌కుమార్ కోరారు. సోమవారం మండలంలోని మఠం కొత్తూరు జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ సూచించారు. అనంతరం హెల్మెట్ ధరించని వాహన దారులతో ఇకపై భద్రత నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

గంజాయికి దూరంగా ఉండాలి



ఇరామవరంలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ నరసింహమూర్తి

గంగవరం(అడ్డతీగల): గంజాయికి దూరంగా ఉండాలని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి అన్నారు. గంగవరం మండలం ఎండపల్లి రామవరం గ్రామంలో సోమవారం ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలు గ్రహించాలన్నారు. మత్తుకు బానిస కావొద్దన్నారు. సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. లోన్ యాప్స్ వంటి వాటి బారిన పడవద్దన్నారు. ఎవరికీ ఓటీపీ షేర్ చేయవద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. వాహనాలకు అన్ని రికార్డులు కలిగి ఉండాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేష్, సర్పంచ్ బందారు రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా



గంగవరంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

గంగవరం(అడ్డతీగల): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గంగవరంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట సోమవారం పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ధర్నా చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మినీ సెంటర్లను అప్‌గ్రేడ్ చేయాలని, పెట్టుబడులు పెట్టి సెంటర్లు నడిపే పరిస్థితిని నివారించాలని నినదించారు.

ఎన్నాళ్లీ పాట్లు!

- అసంపూర్తిగా నాలుగు గ్రామాల రోడ్లు
- రాకపోకలకు తప్పని అవస్థలు
- పూర్తి చేయాలని కోరుతున్న గిరిజనులు
- రేపు, మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్న అధికారులు



అసంపూర్తిగా ఉన్న పడాల్‌పుట్టు రోడ్డు

ముంచంగిపుట్టు: రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని ఆనందించిన ఆ గిరిజనులకు మధ్యలోనే పనులు నిలిచిపోవడంతో కష్టాలు తప్పడం లేదు. అసంపూర్తి రోడ్లపై అష్టకష్టాలు పడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. రోడ్లు పూర్తి చేయాలని అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంచంగిపుట్టు మండలంలో కిలగాడ పంచాయతీలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పడాల్‌పుట్టు గ్రామానికి రూ.3 కోట్లతో 2023లో పీఆర్ ద్వారా రెండు కిలోమీటర్ల రోడ్డు మంజూరైంది. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మెటల్ వేసి వదిలేశారు. నేటికి పూర్తి కాలేదు. ఇదే పంచాయతీ కొత్తులబయలు గ్రామానికి సైతం 2022లో రూ.2కోట్లతో పీఆర్ ద్వారా రోడ్డు మంజూరైంది. మెటల్ వరకు వచ్చి నిలిచిపోయింది. సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామానికి సైతం 2024లో రూ.1.80 కోట్లతో బీటీ రోడ్డు మంజూరైంది. మెటల్ వేసి, కల్వర్టులు నిర్మించారు. కానీ నేటికి పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఇదే పంచాయతీ గొడుగులపుట్టు గ్రామానికి 2018లో రోడ్డు పనులు 80 శాతం పూర్తి చేశారు. తారు వేస్తే రోడ్డు పూర్తవుతుందన్న తరుణంలో మధ్యలోనే కాంట్రాక్టర్ వదిలేశారు. ఈ రోడ్డు పనులు పూర్తి చేయాలని గొడుగులపుట్టు గ్రామ గిరిజనులు అనేక సార్లు ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకోలేదు.

అసంపూర్తి రోడ్లతో అవస్థలు

కిలగాడ, సుజనకోట పంచాయతీల్లో పడాల్‌పుట్టు, కొత్తులబయలు, కుమ్మరిపుట్టు, గొడుగులపుట్టు రోడ్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఆయా గ్రామాల గిరిజనులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై వేసిన మెటల్ వర్షాలకు కొట్టుకుపోవడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో గోతులలో వర్షపు నీరు నిలిచిపోయి, బురదమయంగా రహదారి అంతా మారడంతో రాకపోకలు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్లు వెంటనే పూర్తి చేసి రవాణా కష్టాలు తీర్చాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.



మెటల్ వేసి వదిలేసిన కుమ్మరిపుట్టు రహదారి



మధ్యలో నిలిచిపోయిన గొడుగులపుట్టు రోడ్డు

రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాం..

మండలంలో అసంపూర్తిగా ఉన్న రోడ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాం. నిధుల మంజూరు, పనుల జాప్యంపై ఆరా తీశాం. కాంట్రాక్టర్లతో మాట్లాడాం. త్వరలోనే కుమ్మరిపుట్టు, పడాల్‌పుట్టు రోడ్డు పనులు మొదలు కానున్నాయి. గొడుగులపుట్టు, కొత్తులబయలు రోడ్డు పనులపై కొత్తగా ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

– మురళీకృష్ణ, పీఆర్ ఏఈఈ, ముంచంగిపుట్టు

377 పాఠశాలల మూసివేతకు కూటమి ప్రభుత్వం యత్నం

- రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలు కుదిస్తే ఊరుకోం
- ఎంపీడీవోకు గిరిజన సంఘం సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రుల వినతి



పెదబయలు ఎంపీడీవోకు వినతి అందిస్తున్న గిరిజన సంఘం, వైఎస్సార్ సీపీ నాయకులు

పెదబయలు: కూటమి ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో గిరిజన ప్రాంతంలో ఉన్న సర్కారు పాఠశాలల మూసివేతకు ప్రయత్నిస్తోందని పెదబయలు మండలం గిరిజన సంఘం, పీసా కమిటీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఈమేరకు స్థానిక ఎంపీడీవో పూర్ణయ్యకు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రేషనలైజేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం 117 జీవోను తీసుకొచ్చిందని, దీంతో పాడేరు ఐటీడీఏ పరిధిలో 377 పాఠశాలలు, పెదబయలు మండలంలోనే 32 మూసి వేయాలని కుట్ర పన్నుతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో ఇప్పుడిప్పుడే తమ పిల్లలను చదివించుకోవాలని తల్లిదండ్రులు ఆలోచన చేస్తున్నారని, గ్రామాల్లో ఉన్న బడికి పిల్లలను పంపిస్తున్నారని చెప్పారు. పిల్లలు తక్కువగా ఉన్నారనే నేపంతో గ్రామంలోని పాఠశాలను మూసివేసి, దూరంగా ఉన్న స్కూల్లో చేర్పించినా విద్యార్థులు వెళ్లడానికి ఇష్టపడరన్నారు. దీంతో ఆదివాసీ విద్యార్థులు డ్రాపౌట్స్‌గా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక విద్య గ్రామంలోని పాఠశాలలోనే సాగాలన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి 117 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు బొండా సన్నిబాబు, గోమంగి, సీతగుంట వైస్ సర్పంచులు కూడా మత్స్యకొండబాబు, బి.గంగాధరం, వైఎస్సార్ సీపీ నాయకులు పల్టాసింగి ధనరాజ్, పీసా కమిటీ కార్యదర్శి జుంబు దేవరాజు, గూబరి రాధాకృష్ణ, మండల వినియోగదారుల సంఘం నాయకులు లోహితాస్, కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి నాగప్రత్యూష

అడ్డతీగల: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.నాగప్రత్యూష అన్నారు. సోమవారం తిమ్మాపురం రామాలయంలో ప్రజలకు క్షయ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు వారాల కన్నా ఎక్కువ రోజులు దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, కఫంలో రక్తం పడడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ఆశ కార్యకర్తలకు సమాచారం ఇచ్చి వైద్యులను సంప్రదించాలన్నారు. ఆసుపత్రికి వెళ్లి తగిన వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు వాడుకోవాలన్నారు. ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. ఆరు నెలల పాటు మందులు వాడితే క్షయ వ్యాధి తగ్గిపోతుందన్నారు.

పాడేరు : క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ బి.సూర్యనారాయణమ్మ అన్నారు. యాంటీ టీబీ వీక్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాడేరులోని ప్రభుత్వ ఏఎన్‌ఎం ట్రైనింగ్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందన్నారు. వ్యాధి సోకిన రోగులు మెరుగైన పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. ఎవరికైనా క్షయ వ్యాధి లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది, విద్యార్థులు, టీబీ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి హేయం



రాజవొమ్మంగి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న విలేకరులు

రాజవొమ్మంగి: పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలంలో ఓ పత్రిక విలేకరి మల్యాడ రామారావుపై టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు దాడి చేయడాన్ని స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ విలేకరులు ఖండించారు. సోమవారం ర్యాలీగా స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన విలేకరులు ధర్నాకు దిగారు. అనంతరం డీటీ గ కరీంముల్లాకు వినతి పత్రం అందజేశారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విలేకరులు సూరిబాబు, ఉదయభాను, రామరాజు, బాలరాజు, శివ, శ్రీను, లక్ష్మణ్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

డుంబ్రిగుడ: పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన టీడీపీ మండల అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు ఎం.ఈసుబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.స్వామి డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న వాస్తవాలను బయటపెట్టిన జర్నలిస్టులపై దాడి చేయడం సరికాదన్నారు.

ప్రమాదకరంగా డి.భీమవరం రహదారి



జడ్డంగి వద్ద రహదారిపై పడిన భారీ గండి

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి నుంచి అడ్డతీగల మండలం డి.భీమవరం వెళ్లే రహదారిపై పడిన గండి ప్రమాదకరంగా మారింది. రహదారికి వాలుగా మడేరు ఆనకట్టకు చెందిన పంట కాలువ ప్రవహిస్తోంది. ఈ కాలువపై ఉన్న కల్వర్టు శిథిల స్థితికి చేరి కోతకు గురై గండి పడింది. జడ్డంగి దుర్గాదేవి ఆలయ సమీపాన పడిన ఈ గండి వల్ల భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందవుతోంది. జడ్డంగి నుంచి రేవటిపాలెం, దోనెలపాలెం, వెలగలపాలెం, బోనంగిపాలెం, జమ్మిచావిడి, అడ్డతీగల మండలం దొరమామిడి తదితర గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరారు.

పీసా చట్టంపై అవగాహన పెంచుకోవాలి



గూడెంకొత్తవీధిలో శిక్షణకు హాజరైన డ్వాక్రా సంఘాలతో అధికారులు

పెదబయలు: పీసా చట్టంపై సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు అవగాహన పెంచుకోవాలని స్థానిక ఎంపీపీవో ఎల్.పూర్ణయ్య, స్టేట్ పరిశీలకుడు ప్రసాద్ అన్నారు. ఏపీ పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆదేశాల మేరకు 10 రోజుల పాటు శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐదో రోజు శిక్షణ స్థానిక ఎంపీడీవో, వెలుగు కార్యాలయాల్లో నిర్వహించారు. గ్రామ స్థాయిలో పీసా చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ నర్సింగరావు, 8 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీసా కమిటీలకు కొనసాగుతున్న శిక్షణ

గూడెంకొత్తవీధి: పీసా కమిటీలకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది శిక్షణలో భాగంగా పీసా కమిటీలతోపాటు డ్వాక్రా సంఘాలకు అవగాహన కల్పిస్తున్నట్టు గూడెంకొత్తవీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. శిక్షణకు హాజరైన వారికి తమ హక్కులు, బాధ్యతలను రిసోర్స్ పర్సన్లు వివరించారు. ఈవోపీఆర్డీ పాపారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి



పెదవలసలో రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారి మధుసూధనరావు

గూడెంకొత్తవీధి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు నేరుగా రైతులకు చేరేందుకు వీలుగా ప్రత్యేకంగా ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్టు గూడెం కొత్తవీధి మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు తెలిపారు. సోమవారం ఆయన పెదవలసలో నాలుగు గ్రామాల రైతులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పీఎం కిసాన్, పంట నష్టం, పంటల బీమా, ఈకేవైసీ వంటి వాటితో పాటు ప్రత్యేకంగా ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో రైతులంతా వారి పేర్లు, పంటల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్ తరహాలో రైతులకు ప్రత్యేకమైన సంఖ్యను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. దీని వల్ల భవిష్యత్‌లో ప్రభుత్వాలు అందించే ప్రతి పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి వివరాలను అందించాలని ఏవో కోరారు.

వాహన తనిఖీలను ముమ్మరం చేయాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌ఐ తారకేశ్వరరావు

కొయ్యూరు: వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని కృష్ణాదేవిపేట ఎస్‌ఐ తారకేశ్వరరావు సూచించారు. ఆయన సోమవారం కినపర్తి పంచాయతీ భీమవరంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సందర్శించారు. అనుమానంగా ఉన్న వాహనాలను తనిఖీ చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా నివారించాలన్నారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

అడ్డతీగల: మండలంలోని దుశ్చర్తి గ్రామ శివారున పేకాట ఆడుతున్న ఆరుగురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు దుశ్చర్తి ఎస్‌ఐ కె.వెంకయ్య తెలిపారు. వారి నుంచి రూ.8,600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. దుశ్చర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కడైనా పేకాట, జూదం, కోడిపందేలు నిర్వహించినా, ఆడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



పెదబయలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న గిరిజన సంఘం నాయకులు

పెదబయలు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కోరెట్ల విజయ గౌరికి ఓటు వేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఉపాధ్యాయులను కోరారు. సోమవారం పెదబయలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఉన్న సమస్యలను నాయకులు చర్చించారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్న పడాల్, మాజీ జిల్లా అధ్యక్షుడు బొండా సన్నిబాబు, జుంబు దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు ప్రత్యేక శుభాకాంక్షలు



మాట్లాడుతున్న పాంగి పరశురాం

డుంబ్రిగుడ: మండలంలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేసి గెలుపొందిన సర్పంచ్‌లు నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాంగి పరశురాం పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో ప్రజల మనసు గెలుచుకొని పంచాయతీలను అభివృద్ధి చేస్తున్న సర్పంచులకు ఆయన అభినందనలు తెలిపారు.

దీక్ష చేస్తున్న బాలప్రభకు న్యాయం చేయాలి

హుకుంపేట: మండల కేంద్రం హుకుంపేటలో 22 రోజులుగా తన భూమి కోసం దీక్ష చేస్తున్న బాలప్రభకు న్యాయం చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణా సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రోజుల తరబడి దీక్ష చేస్తున్నా స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం చాల దారుణమన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గిరిజన మహిళకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె' విస్తృత ప్రచారం



బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గాదె శ్రీనివాసులునాయుడు

డుంబ్రిగుడ: ఎమ్మెల్సీగా మరోసారి తనను గెలిపిస్తే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలుకు కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మండలంలోని ప్రభుత్వ ఆశ్రమ బాలుర, బాలికల, కేజీబీవీ, డుంబ్రిగుడ, అరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

అనంతరం ఆయన ఆయా పాఠశాలల బయట ఉపాధ్యాయులతో మాట్లాడారు. కేజీబీవీలలో పని చేస్తున్న సీఆర్‌టీలకు మినిమం టైం స్కేల్ వర్తించేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా బీమా సదుపాయం కల్పించి ఉపాధ్యాయులకు వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులకు 15 రోజుల సాధారణ సెలవులపై స్పష్టతనిచ్చి అమలయ్యేలా చూస్తామన్నారు. పీఆర్‌టీయూ అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిరి, అప్పలరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, రాష్ట్ర కౌన్సిలర్ జి.గెన్ను, జల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శి లక్ష్మయ్య, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గొర్లగూడెంలో ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

చింతూరు: మండలంలోని గొర్లగూడెంలో సోమవారం రాత్రి మడకం రామమూర్తికి చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. రామమూర్తి కుటుంబం రేకుల ఇంట్లో నివాసముంటోంది. ఆ పక్కనే ఉన్న పాకకు ముందుగా నిప్పంటుకుని మంటలు వ్యాపించి రేకుల ఇల్లు కూడా కాలిపోయింది. ఈ ఘటనలో రూ.50 వేల నగదు, తులం బంగారం, ఆరు బస్తాల ధాన్యం, రెండు బస్తాల బియ్యంతో పాటు ఇంట్లోని సామగ్రి బూడిదైందని బాధితుడు వాపోయాడు. సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో దిబ్బిడి విద్యార్థిని



యమునను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

బుచ్చెయ్యపేట : జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని శనివాడ యమున పాల్గొంది. మహారాష్ట్రలోని గ్వాలియర్ పట్టణం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో ఈ నెల 14 నుంచి జాతీయ స్థాయి రగ్బీ పోటీలు జరుగుతున్నాయి. 9వ తరగతి చదువుతున్న యమున జనవరిలో గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. దీంతో యమునను జాతీయ స్థాయిపోటీలకు ఎంపిక చేశారు. ఆమె ఎంపికపై పాఠశాల హెచ్‌ఎంసత్యారావు, కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

జోరుగా రామ ఫలాల అమ్మకాలు



పాడేరు ఘాట్‌లో రామఫలాలు విక్రయిస్తున్న మహిళ

సాక్షి,పాడేరు: కమ్మని రుచుల రామ ఫలాల అమ్మకాలు పాడేరు ఘాట్‌లో భారీగానే జరుగుతున్నాయి. వంట్ల మామిడి, సలుగు, దేవాపురం, మోదాపల్లి, జి.మాడుగుల మండలం వంతాల, సొలబం పంచాయతీల పరిధిలో రామ ఫలాల చెట్లు అధికంగా ఉన్నాయి. ఈ మేరకు వంట్ల మామిడి ప్రాంతానికి గిరిజనులు తీసుకువచ్చి వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్నారు. ఘాట్‌లో ప్రయాణించే అన్ని వర్గాల ప్రజలు రామ ఫలాలను కొనుగోలు చేస్తున్నారు. పండు రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు.